AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in
18-10-2025 (Saturday) MAIN EDITION

## ఓఎన్‌జీసీలో ఉద్యోగావకాశాలు

**అక్షరటుడే, ఎడ్యుకేషన్ డెస్క్:** అప్రెంటిస్ పోస్టుల భర్తీ కోసం ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. టెన్త్, ఐటీఐ, డిగ్రీ అర్హతలతో ఆయా పోస్టులను భర్తీ చేయనుంది. 2,623 అప్రెంటిస్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ను జారీ చేసింది. 18 - 24 ఏళ్ల మధ్య వయసువారు అర్హులు. నవంబర్ 11 వరకు దరఖాస్తు గడువు ఉంది. పూర్తి వివరాలకు వెబ్‌సైట్ https://www.ongcapprentices.in లో సంప్రదించగలరు.

## ఐపీవోకు లలితా జువెల్లరీ!

**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** ప్రముఖ జువెల్లరీ సంస్థల్లో ఒకటైన లలితా జువెల్లరీస్ ఐపీవోకు వస్తోంది. ఇటీవల సెబీ అనుమతులు లభించడంతో త్వరలోనే స్టాక్ మార్కెట్‌లో లిస్టయ్యే అవకాశాలున్నాయి. దీనిపై ఇన్వెస్టర్లలో ఆసక్తి నెలకొంది. ఐపీవో ద్వారా రూ. 1,700 కోట్లు సమీకరించాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో రూ. 1,200 కోట్లు ఫ్రెష్ ఇష్యూ కాగా.. మిగిలినది ఆఫర్ ఫర్ సేల్ ద్వారా ప్రమోటర్ కిరణ్ కుమార్ తన వాటాను విక్రయించనున్నారు. త్వరలోనే ఐపీవో వివరాలు వెల్లడయ్యే అవకాశాలు ఉన్నాయి.

## ఢిల్లీలో ఫైర్ యాక్సిడెంట్



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఢిల్లీలోని ఎంపీల నివాస సముదాయంలో శనివారం భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. పార్లమెంటుకు సమీపంలో ఉన్న రాజ్యసభ సభ్యుల నివాస కాంప్లెక్స్ బ్రహ్మపుత్ర అపార్ట్‌మెంట్‌లో మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని ఆరు ఫైరింజన్లతో మంటలను ఆర్పి వేశారు.

## మంత్రి లోకేశ్ ఆస్ట్రేలియా పర్యటన



**అక్షరటుడే, అమరావతి:** ఏపీ మంత్రి నారా లోకేశ్ ఆదివారం నుంచి ఈ నెల 24 వరకు ఆస్ట్రేలియాలో పర్యటించనున్నారు. ఆ దేశంలోని అధునాతన వర్సిటీల్లో బోధనా పద్ధతులపై అధ్యయనం చేయనున్నారు. సీఐఐ భాగస్వామ్య సదస్సు విజయవంతం చేయాలని రోడ్ షోలు నిర్వహించనున్నారు.

## మాకు దీపావళి నవంబర్ 14నే..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆ రాష్ట్రంలో రాజకీయ వాతావరణం వాడీవేడిగా ఉంది. ఈ తరుణంలో లోక్ జన్‌శక్తి పార్టీ (రాంవిలాస్) చీఫ్ చిరాగ్ పాశ్వాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. తాము నవంబర్ 14న దీపావళి చేసుకుంటామంటూ ఎన్నికల్లో విజయంపై ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## రైలులో అగ్ని ప్రమాదం



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** రైలులో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటన పంజాబ్ లోని సిర్హింద్ రైల్వే స్టేషన్ దగ్గర జరిగింది. అమృత్‌సర్ నుంచి సహర్సాకు వెళ్తున్న గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ లో శనివారం ఉదయం మంటలు చెలరేగాయి. మూడు జనరల్ కోచ్‌లు దెబ్బతిన్నాయి. గరీబ్ రథ్ ఎక్స్‌ప్రెస్ సిర్హింద్ రైల్వే స్టేషన్ నుంచి అంబాలా వైపు అర కిలోమీటరు దూరంలో ఉన్నప్పుడు ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ముందుగా ఒక కోచ్ నుంచి పొగలు వచ్చాయి. అనంతరం మరో రెండు బోగీలకు మంటలు వ్యాపించాయి. ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. రైల్వే అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

## విమానంలో మంటలు

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** విమానం గాల్లో ఉన్న సమయంలో ఓ ప్రయాణికుడి లగేజీలో మంటలు చెలరేగిన ఘటన చైనాలో చోటుచేసుకుంది. ఎయిర్ చైనా విమానయాన సంస్థకు చెందిన విమానం శనివారం తూర్పు చైనాలోని హాంగ్‌జౌ నుంచి దక్షిణ కొరియాలోని సియోల్ సమీపంలోని ఇంచియాన్‌కు బయల్దేరింది. విమానం గాల్లోకి లేచిన కొంత సేపటికే ఓ ప్రయాణికుడి లగేజీలోని లిథియం బ్యాటరీ పేలడంతో మంటలు అంటుకున్నాయి. దీంతో ప్రయాణికులు భయభ్రాంతులకు గురయ్యారు. అప్రమత్తమైన సిబ్బంది విమానాన్ని షాంఘై ఎయిర్‌పోర్టులో అత్యవసర ల్యాండింగ్ చేశారు. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదని ఎయిర్ చైనా వెల్లడించింది.



# ప్రశాంతంగా బీసీ బంద్

రాష్ట్రవ్యాప్తంగా బీసీ బంద్ ప్రశాంతంగా సాగింది. అన్ని పార్టీల నాయకులు బంద్‌లో పాల్గొని విజయవంతం చేశారు. ఉదయం నుంచి ఆయా పార్టీల ఆధ్వర్యంలో ర్యాలీలు, ధర్నాలు నిర్వహించారు. బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బంద్ ప్రభావంతో ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితం అయ్యాయి. దీంతో ప్రజలు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించారు.

–అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

■ మద్దతు తెలిపిన అన్ని పార్టీలు ■ స్వచ్ఛందంగా దుకాణాల మూసివేత ■ డిపోలకే పరిమితమైన బస్సులు ■ ఇబ్బందులు పడ్డ ప్రయాణికులు

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసిన విషయం తెలిసిందే. దీనిపై హైకోర్టు స్టే విధించడంతో బీసీ సంఘాలు బంద్‌కు పిలుపునిచ్చాయి. అన్ని పార్టీలు ఈ బంద్‌కు మద్దతు తెలిపాయి. ఆర్టీసీ డిపోల ఎదుట శనివారం తెల్లవారు జామున నాయకులు ధర్నాలు చేశారు. ఉదయం నుంచి బస్సులు డిపోలకే పరిమితం అయ్యాయి. దీంతో ప్రజా రవాణా వ్యవస్థ స్తంభించిపోయింది. ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రజలు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించారు.

### దుకాణాల మూసివేత..

రాష్ట్రంలో అన్ని వ్యాపార సంఘాలు బంద్‌కు మద్దతు ప్రకటించాయి. దీంతో చాలా వరకు దుకాణాలను స్వచ్ఛందంగా మూసి వేశారు. ప్రైవేట్ విద్యా సంస్థలు ముందు రోజే సెలవు ప్రకటించాయి. ప్రభుత్వ పాఠశాలలు కొనసాగగా.. బీసీ సంఘాల నేతలు మూసి వేయించారు.

### అన్ని పార్టీల నేతలు

బీసీ బంద్‌లో అన్ని పార్టీల నేతలు పాల్గొన్నారు. అధికార కాంగ్రెస్‌తో పాటు, బీఆర్ఎస్, బీజేపీ



నాయకులు బంద్‌కు మద్దతుగా ర్యాలీలు, నిరసనలు చేపట్టారు. అంబర్‌పేటలో కాంగ్రెస్ చేపట్టిన ర్యాలీలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. రాష్ట్ర మంత్రులు సైతం నిరసన ర్యాలీల్లో పాల్గొన్నారు. బీఆర్ఎస్, బీజేపీ ప్రజాప్రతినిధులు సైతం ఆందోళనలు చేపట్టారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఖైరతాబాద్‌లో నిర్వహించిన మానవహారంలో కల్వకుంట్ల కవిత తన కుమారుడితో కలిసి పాల్గొన్నారు.

### దుకాణాలపై దాడి

హైదరాబాద్ నగరంలో బీసీ బంద్ సందర్భంగా ఉద్రిక్తత నెలకొంది. బంద్ పాటించని పలు దుకాణాలపై బీసీ సంఘాల నాయకులు రాళ్లతో దాడి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. నల్లకుంట ప్రాంతంలో నిరసనకారులు బజాజ్ షోరూమ్, రాఘవేంద్ర టిఫిన్ సెంటర్‌పై రాళ్లు రువ్వారు.

### కిందపడిపోయిన వీహెచ్

బీసీ బంద్‌కు మద్దతుగా అంబర్‌పేటలో నిర్వహించిన ర్యాలీలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వి. హనుమంత్ రావు పాల్గొన్నారు. ర్యాలీలో ఆయన నడుస్తుండగా.. బ్యానర్ కాలికి అడ్డుతగలడంతో కింద పడిపోయారు. దీంతో ఆయనకు స్వల్ప గాయాలు అయ్యాయి. పక్కనే ఉన్న నాయకులు వెంటనే స్పందించి ఆయనను లేపారు.

### కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య ఘర్షణ

మహబూబాబాద్ జిల్లా తొర్రూరు టౌన్‌లో ఉద్రిక్తత చోటు చేసుకుది. బీసీ బంద్ సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు వేర్వేరుగా ర్యాలీలు నిర్వహించారు. తొర్రూరు బస్టాండ్ వద్ద రెండు పార్టీల నేతలు ఎదురుపడడంతో పోటాపోటీగా నినాదాలు చేసుకున్నారు. అనంతరం ఎదురెదురుగా దూసుకొచ్చి, తోపులాటకు యత్నించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు రంగంలోకి దిగి ఇరువర్గాలకు సర్ది చెప్పారు.

## కానిస్టేబుల్ హత్య కేసు నిందితుడిని పట్టుకుంటాం: ఐజీ



**అక్షరటుడే, నిజామాబాద్:** నగరంలో సీసీఎస్ కానిస్టేబుల్ ప్రమోద్‌ను హత్య చేసిన నిందితుడు రియాజ్‌ను త్వరలోనే పట్టుకుంటామని ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలో శనివారం అధికార లాంఛనాలతో నిర్వహించిన ప్రమోద్ అంత్యక్రియలకు ఐజీ హాజరయ్యారు. ప్రమోద్ పార్థీవదేహానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పారు. అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

### శాంతిభద్రతల విషయంలో రాజీ పడేది లేదు..

కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల విషయంలో ఎట్టిపరిస్థితుల్లో రాజీ పడేది లేదని ఐజీ పేర్కొన్నారు. నిందితుడు రియాజ్ కోసం సీపీ సాయిచైతన్య ఆధ్వర్యంలో పోలీసులు బృందాలుగా ఏర్పడి తీవ్రంగా గాలిస్తున్నారన్నారు. త్వరలోనే నిందితుడిని పట్టుకుని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## ఉపాధ్యాయుడికి పదేళ్ల జైలు



**అక్షరటుడే, హైదరాబాద్:** విద్యాబుద్ధులు చెప్పాల్సిన ఉపాధ్యాయుడే అఘాయిత్యానికి పాల్పడ్డాడు. తండ్రి తర్వాత తండ్రిలా కంటికి రెప్పలా కాపాడాల్సిన వాడే కామాంధుడిగా మారాడు. ఈ కీచకుడికి కోర్టు కఠిన శిక్షే విధించింది. విద్యార్థినిపై అత్యాచారం చేసిన ట్యూషన్ టీచర్‌ను రాజేంద్రనగర్ కోర్టు కఠినంగా శిక్షించింది. నిందితుడికి పదేళ్ల జైలుశిక్ష విధిస్తూ ఇక్కడి ప్రత్యేక పోక్సో కోర్టు జడ్జి ఆంజనేయులు తీర్పునిచ్చారు. ఏపీపీ దేవులపల్లి ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏడో తరగతి చదివే బాలికకు వారి అపార్టుమెంటులోనే సుబ్రమణేశ్వర్ రావు ట్యూషన్ చెప్పేవాడు. 2017లో బాలికను ఓ గదిలోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. మరుసటి రోజు బాధితురాలు తన తల్లికి కాల్ చేసి ఘోరాన్ని వివరించింది. తల్లిదండ్రులు రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. సాక్ష్యాధారాలను కోర్టుకు నివేదించారు. వాటిని క్షుణ్ణంగా పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడికి పదేళ్ల జైలు శిక్షతోపాటు రూ. ఐదు వేల జరిమానా విధించారు.

## టాయిలెట్‌లో కూర్చుంటే హెల్త్ రిపోర్ట్..




**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** ఉదయం టాయిలెట్‌కు వెళ్లడం ఇక సాధారణ అలవాటు మాత్రమే కాదు.. ఒక ఆరోగ్య తనిఖీ ప్రక్రియగా మారబోతోంది. ఆధునిక ఏఐ టెక్నాలజీ ఆధారంగా రూపొందిస్తున్న స్మార్ట్ టాయిలెట్లు ఇప్పుడు మీ ప్రేగు ఆరోగ్యాన్ని పర్యవేక్షిస్తాయి. ప్రపంచవ్యాప్తంగా శాస్త్రవేత్తలు, హెల్త్ టెక్ స్టార్టప్‌లు అభివృద్ధి చేస్తున్న ఈ టాయిలెట్లు మల, మూత్ర విశ్లేషణ ద్వారా మీ ఆరోగ్య పరిస్థితిని అంచనా వేస్తాయి. వీటిలో అత్యాధునిక సెన్సార్లు, కెమెరాలు, ఏఐ అల్గారిథమ్‌లు అమర్చబడి ఉంటాయి. మల విసర్జన జరిగాక టాయిలెట్‌లోని కెమెరాలు మలం రంగు, ఆకారం, పరిమాణం, గట్టిదనం వంటి వివరాలను చిత్రీకరిస్తాయి. వీటిని ఏఐ వ్యవస్థ ఈ డేటాను విశ్లేషించి ఫలితాలను వర్గీకరిస్తుంది. అసాధారణ మార్పులు కనిపిస్తే వినియోగదారుడికి హెచ్చరిక పంపిస్తుంది. మూత్ర ప్రవాహం, హైడ్రేషన్ స్థాయిలను కూడా కొలిచి వ్యక్తిగతీకరించిన ఆరోగ్య సూచనలు ఇస్తుంది.

## ఆపరేషన్ సిందూర్ ట్రైలర్ మాత్రమే..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** పాకిస్థాన్‌కు భారత రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వార్నింగ్ ఇచ్చారు. ఇటీవల పాక్ మంత్రులు కవ్వింపు వ్యాఖ్యలు చేస్తున్న నేపథ్యంలో ఆయన కౌంటర్ ఇచ్చారు. ఉత్తర ప్రదేశ్‌లోని బ్రహ్మోస్ ఏరోస్పేస్ యూనిట్‌ను రాజ్‌నాథ్ సింగ్ సందర్శించారు. అక్కడ తయారైన బ్రహ్మోస్ క్షిపణుల మొదటి బ్యాచ్‌ను శనివారం కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ముఖ్యమంత్రి ఉత్తరప్రదేశ్ యోగి ఆదిత్యనాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్ ట్రైలర్ మాత్రమే అని, పాక్ దుస్సాహసానికి పాల్పడితే ఊహించని ప్రతిస్పందన ఉంటుందని హెచ్చరించారు.

## పాకిస్థాన్ దాడి.. అఫ్గాన్ క్రికెటర్లు సహా 8 మంది మృతి



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** పాకిస్థాన్ హద్దులు దాటుతోంది. కాల్పుల విరమణ ఉన్నప్పటికీ అఫ్ఘనిస్థాన్‌పై దాడులు చేస్తోంది. తాజాగా పాక్టికా ప్రావిన్స్‌లో వైమానిక దాడికి దిగింది. ఈ ఘటనలో ముగ్గురు అఫ్ఘనిస్థాన్ క్రికెటర్లు ప్రాణాలు కోల్పోయారు. పాకిస్థాన్, అఫ్ఘనిస్థాన్ దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతల్లో భాగంగా ఈస్ట్రన్ పాక్టికా ప్రావిన్స్‌పై పాకిస్థాన్ వైమానిక దాడి నిర్వహించింది. ఈ ఘటనలో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోగా.. మరో ఏడుగురు గాయపడ్డారు. మృతుల్లో ముగ్గురు అఫ్ఘనిస్థాన్ దేశవాళి క్రికెటర్లు కూడా ఉన్నారు. ఈ విషయం అఫ్ఘనిస్థాన్ క్రికెట్ బోర్డు ధృవీకరించింది. మృతులు కబీర్ అఘా, సిబాతుల్లా, హరూన్‌గా గుర్తించారు. వీరే కాకుండా మరో ఐదుగురు అఫ్ఘాన్ పౌరులు మృతి చెందారు.

## సమంత ఆసక్తికర వ్యాఖ్యలు

సౌత్ స్టార్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన సమంత ఇప్పుడు స్లో అయింది. సినిమాలు తగ్గించింది.. కానీ ఏదో ఒక విషయంతో నిత్యం వార్తల్లో నిలుస్తూ ఉంటుంది. తాజాగా ఎన్డీటీవీ వరల్డ్ సమ్మిట్‌లో ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. తాను కంప్లీట్ పర్సన్ కాదని, తప్పులు చేసినా మెరుగ్గా ఉండడానికి ప్రయత్నిస్తున్నామని చెప్పారు. యువత తమ మార్గదర్శకులను జాగ్రత్తగా ఎంచుకోవాలి, అది వారి జీవితాన్ని మార్చగలదని సూచించారు. తాను సాధారణ నేపథ్యం నుంచి వచ్చిన వ్యక్తిని అని చెప్పిన సమంత, తన కుటుంబం ఆహారం పెట్టడానికి కూడా ఎంతో కష్టపడ్డారని చెప్పుకొచ్చారు.

- అక్షరటుడే, సినిమా డెస్క్

